క్లుప్తంగా

డిజిటల్ అరెస్టులు ఉండవు: డీఎస్పీ



మహబూబ్‌నగర్ క్రైం: ఇటీవల కాలంలో సైబర్ నేరాల్లో భాగంగా డిజిటల్ అరెస్ట్, బెట్టింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు అధికంగా మోసాలు చేస్తున్నారని సైబర్ క్రైం డీఎస్పీ సుదర్శన్ అన్నారు. డిజిటల్ అరెస్టులు అనేది ఎక్కడ ఉండదని అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్, సోషల్ మీడియా పరిధి పెరిగిపోవడం వల్ల సైబర్ నేరాలు చేయడానికి సులువుగా మారిందని, అత్యాశకు పోయి అనవసరంగా వచ్చిన మెసేజ్‌లు క్లిక్‌చేయడం చేయరాదన్నారు. సైబర్‌క్రైం సీఐ గోపాల్, ఎస్‌ఐ శ్రవణ్, కళాశాల ప్రిన్సిపాల్ జయప్రద పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం పోలీసులు సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేడు ఎక్కువగా సెల్‌ఫోన్లకు వచ్చే మెసేజ్‌లతో మోసపూరిత ప్రకటనలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడకూడదన్నారు.

విధుల్లోకి కొత్త అధ్యాపకులు

మహమ్మదాబాద్: గతేడాది మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నూతన జూనియర్ కళాశాలకు కొత్త అధ్యాపకులు వచ్చి విధుల్లో చేరినట్లు ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. తెలంగాణ పబ్లిక్‌సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులైన 8మంది అధ్యాపకుల్లో ఆరుగురు అధ్యాపకులు బుధవారం కళాశాలలో విధుల్లో చేరారు. మిగతా ఇద్దరు ఇంటర్ మూల్యాంకనం అనంతరం విధుల్లో చేరుతారన్నారు.

ఆరుబయట చెత్త వేసినందుకు జరిమానా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలో కొన్ని చోట్ల ఆరుబయట చెత్త వేసినందుకు బుధవారం నలుగురికి మున్సిపల్ అధికారులు రూ.3,500 జరిమానా విధించారు. భగీరథకాలనీలో స్వచ్ఛ ఆటోకు ఇవ్వకుండా బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేసినందుకు ఓ ఇంటి యజమాని నుంచి రూ.500, భూత్పూర్ ప్రధాన రహదారి పక్కన వ్యర్థ పదార్థాలు, చెత్త, ప్లాస్టిక్ బాటిళ్లను డ్రెయినేజీలో వేసినందుకు ఓ వైన్ షాపు నిర్వాహకుల నుంచి రూ.రెండు వేలు, అలాగే ఓ చేపల దుకాణదారుడి నుంచి రూ.500 చొప్పున జరిమానా వసూలు చేశారు. అంబేడ్కర్ కళాభవన్ పక్కన ఉన్న హాజీ గఫూర్ పెట్రోల్ బంక్ నిర్వాహకులకు రూ.500 జరిమానా వేశారు.

15వ ఆర్థిక సంఘం నిధులకు అర్హత

జడ్చర్ల టౌన్: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులకు జడ్చర్ల మున్సిపాలిటీ అర్హత సాధించింది. ప్రతి ఏటా ఆస్తి పన్ను వసూలు డిమాండ్ చేరుకుంటేనే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తారు. మున్సిపాలిటీలో 18,365 ఇళ్లు, 101 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం పన్ను వసూలు డిమాండ్ రూ.5.96 కోట్లు కాగా ఇందులో వసూలు కాని పన్నులు అంటే ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పన్ను రూ.1.50 కోట్లుగా ఉంది. ఇది మినహాయిస్తే లక్ష్యం రూ.4.46 కోట్లుగా నిర్ణయించారు. ఇందులో మార్చి 31 నాటికి రూ.3.48 కోట్లు వసూలు చేశారు. మొత్తం 11 బృందాలు మున్సిపాలిటీలో ఇంటింటికి తిరిగి పన్నులు వసూలు చేశారు. గత ఏడాది రూ.3.08 కోట్ల పన్నులు వసూలు కాగా ఈ ఏడాది రూ.40లక్షలు అదనంగా వచ్చాయి. వసూలు సమయంలో కొన్ని వివాదాలు సైతం నెలకొన్నాయి. పన్ను లక్ష్యంలో 80శాతం వసూలు చేస్తేనే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతాయి. మున్సిపాలిటీలో 86శాతం పన్ను వసూలు కావటంతో ఆర్థిక సంఘం నిధులకు అర్హత సాధించింది. దాదాపు రూ.50లక్షలు నాలుగు విడతలుగా అంటే మూడు నెలలకోమారు కేంద్రం విడుదల చేస్తుంది. నిధులు సాధించడానికి సిబ్బంది కృషి ఉందని కమిషనర్ లక్ష్మారెడ్డి వెల్లడించారు. సిబ్బంది కృషిని మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత అభినందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మహబూబ్‌నగర్ రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సుప్రభాత్ హెల్త్ క్లబ్ కన్వీనర్ జి. పాండురంగం అన్నారు. ఇటీవలే నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉగాది వేడుకల్లో పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా బుధవారం ఆయనను స్థానిక బాలురకళాశాల మైదానంలో ఘనంగా సన్మానించారు. పాను గడ్డ యాదయ్య, శంకరయ్య, సుగుణ యోగా సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రం కుట్రను తిప్పికొడుదాం

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



జిల్లా కేంద్రంలో జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నదని, దీనిని తిప్పికొడుదామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఏఐసీసీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని 11, 25 వార్డులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మైనార్టీల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగానే రాజ్యాంగం మార్చాలనే కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, ఎన్‌పీ.వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రీ, జహీర్ అక్తర్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట తప్పలేదు

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పలేదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వీరన్నపేట, బండ్లగేరిలో కలెక్టర్ విజయేందిరబోయితో కలిసి, మండలంలోని ఓబ్లాయిపల్లిలో తెల్ల రేషన్‌కార్డు కలిగిన లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే ఓబ్లాయిపల్లిలో జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, తహసీల్దార్ సుందర్‌రాజ్ పాల్గొన్నారు.

తూకంలో, నాణ్యతలో ఫిర్యాదు వస్తే..

సన్నబియ్యం పంపిణీలో తూకంలో గాని, నాణ్యతలో గాని ఎలాంటి ఫిర్యాదు వచ్చినా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయేందిర బోయి స్పష్టం చేశారు. ఉగాది నుంచి రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 506 చౌకధర దుకాణాల ద్వారా కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. 2,44,678 మంది కార్డులు కలిగిన కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీకి 5,228 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించినట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఎస్‌ఓ వెంకటేష్, డీఎం రవినాయక్, డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్ ఉన్నారు.

కష్టపడి చదివితే..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థినులకు నీట్, ఎప్‌సెట్‌కు ఉచిత క్రాష్ కోర్సును సొంత నిధులతో ఎమ్మెల్యే ప్రారంభించారు. డీఐఈఓ కౌసర్‌జహాన్, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

సంక్షేమానికి కట్టుబడి ఉంది

హన్వాడ: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. నూతన పాఠశాల భవన నిర్మాణానికి ఏనెమీదితండాలో ఐదెకరాల స్థలాన్ని కేటాయించామని వివరించారు. పాఠశాల సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను సన్మానించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఊర్కొండపేట దేవాలయం సమీపంలో సామూహిక హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని భారత మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కే.పద్మావతి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆ సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఊరుకొండపేటలో జరిగిన సామూహిక హత్యాచారం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత మహిళకు సత్వరమే న్యాయం అందించాలని డిమాండ్ చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా నాయకులు మాధవి, సత్యమ్మ, సింధు, లక్ష్మి, కళ, వరలక్ష్మి, పద్మ, జ్యోతి, మణెమ్మ, అనన్య పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావంతో పనిచేయాలి

భూత్పూర్: విద్యార్థులు విద్యతో పాటు సేవాభావంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంవీఎస్ కళాశాల ప్రధానాచార్యులు డా.కె.పద్మావతి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని గోప్లాపూర్ గ్రామంలో ఎంవీఎస్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎస్.సుప్రియ–1, డా.బి. స్వరూప్ యూనిట్–2 , డా.జె.బాలరాజ్ యూనిట్–4 ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ నెల 7వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా వీధులను శుభ్రం చేయడం, అపరిశుభ్రతతో కలిగే అనర్థాలపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపక బృందం, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం

భూత్పూర్: రాష్ట్రం ఏర్పాటు నుంచి నేటి వరకు జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టీయూడబ్ల్యూజే 143 కృషి చేస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మారుతీసాగర్ అన్నారు. బుధవారం భూత్పూర్ మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే 143 సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆయూనియన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వర్దల్లి వెంకటేశ్వర్లు, నేషనల్ కౌన్సిల్ సభ్యులు పెరుమాండ్ల కిషోర్, జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు నూతన జర్నలిస్టు మండల కార్యవర్గం ఏర్పాటు చేశారు.

ప్రార్థనా మందిరాల వద్ద రాజకీయం వద్దు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దేవాలయాలు, ఈద్గాలు, ప్రార్థనా మందిరాల వద్ద మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రాజకీయం చేయడం తగదని డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ అన్నారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గత నెల 31న జిల్లా కేంద్రంలోని వానగట్టు వద్ద రంజాన్ పండగ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఇటీవలే ఈద్గా కమిటీ రద్దయినందున ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో అక్కడ అందరికీ షామియానాలు, కుర్చీలు, తాగునీటి సౌకర్యం కల్పించారన్నారు. అయితే వేదికపై మాజీ మంత్రికి కుర్చీ దొరకలేదని, ఆయనకు అవమానం జరిగిందని, ప్రొటోకాల్ పాటించలేదని సోషల్ మీడియాలో బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ పోస్టు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. వీరిద్దరూ రాచాలకు చెందిన వారే కావడంతో మద్దతు పలికినట్లుగా తమకు అవగతమవుతోందన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన



డంపింగ్ యార్డు లో తడిచెత్తను పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులోని డంపింగ్ యార్డును బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అక్కడ బహిరంగ ప్రదేశంలో తడి చెత్తకు సంబంధించి బయో మైనింగ్ సక్రమంగా నిర్వహిస్తున్నది? లేనిది? ఆరా తీశారు. అలాగే డీఆర్‌సీసీకి చెందిన రెండు షెడ్లలో పొడి చెత్తను ఏ విధంగా వేరు చేస్తున్నది? రీసైక్లింగ్ కోసం ఎలా పంపిస్తున్నారో? అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకుని తగు సూచనలిచ్చారు. అంతకుముందు అక్కడికి చేరుకోవడానికి రహదారి పక్కన నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను తనిఖీ చేశారు.

■ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఈనెల 30వ తేదీలోగా చెల్లించేవారికి 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నగరంలోని అసెస్‌మెంట్‌దారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అపరకర్మల భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ట్రస్టు సభ్యులు

జడ్చర్ల టౌన్: మండలంలోని మీనాంబర క్షేత్రంలో రాజరాజేశ్వర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అపరకర్మల భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. పూజ సందర్భంగా స్థలదాత ట్రస్టు చైర్మన్ రవీందర్‌రావు మాట్లాడుతూ కలసికట్టుగా భవన నిర్మాణం పూర్తిచేద్దామని పిలుపునిచ్చారు. తోచిన విధంగా సహాయం అందించాలని కోరారు. సభ్యులు అశోక్, ఈఎల్ఎస్‌రావు, రంగారావు, ప్రవీణ్, సృజన్, అతిథి జాతీయ సంపాదకులు వెంకటేశ్వరరావు, న్యాయవాదులు శర్మ, మోహన్‌రావు, శ్రీధర్‌రావుతో పాటు బ్రాహ్మణులు పాల్గొన్నారు.

నర్సరీలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి

నవాబుపేట: నర్సరీలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. బుధవారం మండలంలోని అమ్మాపూర్, దయాపంతులపల్లి గ్రామాల్లో ఆయన నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు కేటాయించిన లక్ష్యం మేరకు 20 వేలకు తగ్గకుండా మొక్కల పెంపకం చేపట్టి వాటిని సంరక్షించాలన్నారు. ఆయన వెంట ఏపీఓ జ్యోతి, వివిధ గ్రామాల పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

స్ఫూర్తి ప్రదాత సర్వాయి పాపన్నగౌడ్



బాలానగర్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్ఫూర్తిప్రదాత సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రం పద్మావతికాలనీలో గ్రీన్‌బెల్టులోగల సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పాపన్న ఆశయసాధనకు కృషిచేయాలి

మహమ్మదాబాద్: పాపన్నగౌడ్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మాజీ ఎంపీపీ శాంతీబాయి అన్నారు. మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు వేణుగౌడ్, కమతం ప్రదీప్‌కుమార్‌రెడ్డి, అనంతయ్యగుప్త, నరేందర్ గౌడ్, వెంకటేశ్‌గౌడ్, ఆనందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

హన్వాడ: మండలంలోని వెన్నాచెడ్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దత్తుగౌడ్, ఈశ్వరయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

బడుగు, బలహీన వర్గాలను ఏకం..

రాజాపూర్: బడుగుబలహీన వర్గాలను ఏకం చేసిన తొలి బహుజన చక్రవర్తి పాపన్నగౌడ్ అని పెద్దరేవల్లి యాదయ్యగౌడ్ అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

● ఆర్టీసీ ఆర్ఎం సంతోష్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎం సంతోష్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఆర్ఎం సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో నిర్వహించిన ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి డాక్టర్‌ను అందుబాటులో ఉంచామని, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసి, మందుల సరఫరా కొరత లేకుండా చేశామన్నారు. విశ్రాంత ఉద్యోగుల బకాయిలను సంస్థ ఎండీకి నివేదికలు పంపి పరిష్కారం దిశగా కృషి చేస్తామని అన్నారు. ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు మాట్లాడుతూ సర్వీసులు ఉండి చనిపోయిన ఉద్యోగస్తుల వారసులకు వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జీబీ. పాల్, భగవంతు, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.నారాయణ, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు జగపతిరావు, కార్యదర్శి నాగభూషణం, లలితమ్మ, బుచ్చన్న, వెంకటయ్య పాల్గొన్నారు.

మధురానగర్ బస్టాప్‌లో బస్సులు నిలపాలి

జిల్లా కేంద్రంలోని మధురానగర్ బస్టాప్‌లో బస్సులు నిలపాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రమోహన్, అహ్మద్ ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. మధురానగర్ కాలనీ వాసులు అందరం కలిసి అక్కడ బస్టాప్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.

పేదల సంక్షేమానికి కృషి

● ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



నెల్లికొండిలో సన్నబియం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నెల్లికొండి గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏఐసీసీ పిలుపుమేరకు గ్రామంలో చేపట్టిన జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి పేదోడికి రేషన్ ద్వారా సన్నబియ్యం అందించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కథలప్ప, అప్పంపల్లి సింగిల్ విండో డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్లయ్య, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

దేవరకద్ర: ప్రజలకు సన్న బియ్యం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావుతో కలిసి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మార్కెట్ చైర్మన్ కథలప్ప, వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఈఓ సీత్యానాయక్, నాయకులు అంజిల్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కొనరాజశేఖర్, గోవర్ధన్‌రెడ్డి, ఆదిహన్మంతరెడ్డి, ఫారూక్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కారుకొండలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న నాయకులు



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి

నవాబుపేట: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కారుకొండ, పోమాల్, లోకిరేవు, కామారం, లింగంపల్లి, రేకుల చౌడాపూర్, ఊరంచుతండా గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన డీలర్లు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య, వెంకటేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, ఆంజనేయులు, కుమార్, వెంకటయ్య, రమేష్‌గౌడ్, నరేష్, శంకర్‌నాయక్, శర్మ, శ్రీహరి, అమరేష్, శ్రీను తదితరులున్నారు.

నిరుపేదలకు లబ్ధి

మిడ్జిల్: సన్న బియ్యం ద్వారా ఎంతో మంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జ్యోతి, వాడ్యాల్ గ్రామంలో తహసీల్దార్ యాపిరాజు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకులు అల్వాల్‌రెడ్డి, వెంకటయ్య,. గౌస్, సంపత్, రాజేశ్వర్, సాయిలు, జహంగీర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం మహబూబ్‌నగర్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి మద్ది అనంతరెడ్డి, మద్ది యాదిరెడ్డి రూ.లక్ష చెక్కును ఎస్పీ డి.జానకికి బుధవారం ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పని చేస్తాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తులు ఆహ్వానం

జడ్చర్ల టౌన్: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2014 రాష్ట్ర ప్రభుత్వం జారీ కుల ధ్రువీకరణ పత్రం ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 14వరకు గడువు ఉందని, అనుభవం ఉన్న యూనిట్‌ను ఎంపిక చేసుకోవాలని కోరారు.

ఇసుకను అవసరాలకు వినియోగించాలి

మిడ్జిల్: మండలంలోని అయ్యవారిపల్లిలో సీజ్‌చేసిన ఇసుకను అవసరాలకు వినియోగించాలని బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ రాజుకు వినతిపత్రం సమర్పించారు. అయ్యవారిపల్లి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, అరికట్టాలని అన్నారు. పాండు యాదవ్, సుదర్శన్, జంగారెడ్డి, శ్రీనువాస్‌గౌడ్, సురేష్, భీంరాజ్ పాల్గొన్నారు.

12న హనుమాన్ శోభాయాత్ర



స్టేషన్ మహబూబ్‌నగర్: విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో హనుమాన్ జయంతి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గణేష్ భవన్‌లో బుధవారం హనుమాన్ శోభాయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరహనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలిపారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు రాంమందిర్ చౌరస్తా వద్ద శోభాయాత్ర బయలుదేరి గడియారం చౌరస్తా, బాలాగంగాధర్ తిలక్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, న్యూటౌన్ మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు చేరుకుంటుందని తెలిపారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నాగరాజు, విభాగ్ సహ కార్యదర్శి నలిగేశి లక్ష్మినారాయణ, విభాగ్ సత్సంగ సంయోజక్ రాచాల జనార్దన్, జిల్లా ఉపాధ్యక్షులు హన్మంతు, కోశాధికారి శ్రీధర్‌బాబు ఉన్నారు.

సప్తాహ మహోత్సవాలు ప్రారంభం



దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి 96 వ సప్తాహ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. శివాలయం, వీరప్పయ్యస్వామి దేవాలయాల్లో ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అఖండ దీపారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు స్వామి సేవా కార్యక్రమం పట్టణంలో నిర్వహించి దేవాలయాల్లో అఖండ భజనలు ప్రారంభించారు. వారం రోజుల పాటు అఖండ భజనలు కొనసాగుతాయని దేవస్థానం వారు తెలిపారు. దేవస్థాన కమిటీ చైర్మన్ బీసు నర్సింహారెడ్డి, కమిటీ సభ్యులు వడ్ల వెంకటయ్య, లక్ష్మమ్మ, బీరప్ప, అర్చకులు నాగారాజు స్వామి, నాగభూషణంస్వామి పాల్గొన్నారు.

సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని వినతి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ లో సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో ఎంపీలు రవిచంద్ర, సురేష్‌రెడ్డి, దామోదర్‌తో కలిసి కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి వినతి పత్రం సమర్పించారు. మహబూబ్‌నగర్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీకి అవసరమైన ముడి పదార్థాలైన సున్నపురాయి, లాటరైట్ రాయి వంటి ముడి పదార్థాలు, స్కిల్ వర్కర్స్ అందుబాటులో ఉన్నారని చెప్పారు.

యువకుడికి రిమాండ్

అడ్డాకుల: డీసీఎంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా అడ్డు వెళ్లిన పోలీసులపైకే వాహనాన్ని తీసుకెళ్లిన యువకుడిని రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. వివరాలు.. మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లికి చెందిన మామిళ్ల విజయ్‌కుమార్ ఈనెల 28న రాత్రిపూట తన డీసీఎం వాహనంలో అక్రమంగా ఇసుకను నింపుకొని వెళ్తుండగా పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు బైక్‌పై అక్కడికి వెళ్లారు. దీన్ని గుర్తించిన విజయ్‌కుమార్ తన వాహనాన్ని పోలీసుల ద్విచక్ర వాహనానికి తగిలించి అక్కడి నుంచి వాహనంతో పరారయ్యాడు. బైక్‌పై ఉన్న కానిస్టేబుళ్లు కింద పడిపోయారు. దీనిపై ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.